**కథ**

# ఒక తల్లి నిర్ణయం

**"అమ్మా.. మనందరికీ పదహారో తారీఖు మద్రాస్ వెళ్ళడానికి టికెట్లు రిజర్వు చేయించుకొచ్చాను. నా సెలవు అయిపోతోంది. నీ కోడలికి కూడా స్కూల్‌లో లీవు పొడిగించడానికి కుదరదు. పిల్లలకీ పరీక్షలు. రెండు మూడు నెలల తర్వాత వీలుంటే ఓ పది రోజులు వచ్చి ఊళ్ళో ఏమైనా పని ఉంటే ముగించవచ్చు" ఈశ్వర్ 'ఏమంటావు' అన్నట్టు తల్లి వైపు చూశాడు.**

''నాకెందుకు చేయించావురా రిజర్వేషన్, నాది కాన్సిల్ చెయ్యి. ఇక్కడ ఇల్లూ అదీ చూసుకుంటూ నేనిక్కడే ఉంటాను. అదీకాకుండా ఆ పట్నంలో భాష తెలియని చోట నాకు ఇబ్బందిగా ఉంటుంది'' వసుంధర జవాబు విన్న శరణ్య మనసు తేలికైంది. ఇరవై రోజుల క్రితం మామగారు పోయారు అనే టెలిగ్రాం అందుకుని అనకాపల్లి వచ్చారు ఈశ్వర్, శరణ్యా.

ఈశ్వర్ తల్లిదండ్రులకి ఒక్కడే సంతానం. చదువు ముగిశాక పదేళ్లుగా చెన్నైలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈశ్వర్ పెళ్ళి కాగానే తల్లినీ, అప్పటికే రిటైరైన తండ్రినీ తనతో వచ్చి ఉండమన్నాడు. ఈశ్వర్ తండ్రి జగన్నాథంగారికి ఆస్తమా, కీళ్ళనెప్పులు. ఉన్న ఊళ్ళోనే ఉంటామని వాళ్ళు ఈశ్వర్‌తో వెళ్ళలేదు.

''ఊళ్ళో వాళ్ళు ఏమనుకుంటారు అమ్మా, నలుగురూ నన్నే అంటారు. ఇన్నాళ్ళూ నాన్నగారు ఉన్నారు కాబట్టి మీరిక్కడ ఉన్నా బావుంది. కానీ నువ్విప్పుడు ఒక్కర్తివే ఉండాలి. అదేమైనా బావుంటుందా? నాకు మాటొస్తుంది.''

''ఏమీ రాదు ఈశ్వర్. నలుగురి గురించీ ఎందుకు ఆలోచిస్తున్నావు? మనం మన ఇష్టప్రకారం ఉంటాము. ఇందులో ఎవరో అనుకుంటారు అన్న ప్రసక్తే లేదు. అయినా నేనే రానంటున్నాను కానీ నువ్వు 'రావద్దు' అనలేదుగా. నీ ధర్మం ప్రకారం నువు పిలిచావుకానీ, మీ నాన్నగారు లేకపోయినా ఇది నాకు బాగా తెలిసిన ఊరు. అలవాటైన మనుష్యులు. అదీగాక పక్కవాటాలో ఉండే వాళ్ళు ఇంట్లోవాళ్ళలాగే ఉంటారు. సందడికీ తక్కువేం లేదు. మధ్య తలుపు తీసిపెడ్తే ఒక్కటే ఇల్లు. వాళ్ళ పిల్లలు తోడుగా ఇక్కడ పడుకుంటారు, చదువుకుంటారు. మీ నాన్నగారు ఉన్నప్పుడూ వాళ్ళ పిల్లలు మన వాటాలోనే మసలుతూ ఉండేవారు. మీరు వెళ్ళండి... వీలున్నప్పుడు వస్తూ ఉండండి'' వసుంధర మాటలకి ఏం చెప్పాలో తెలియనట్టు ఒక్కక్షణం ఇబ్బందిగా కదిలాడు ఈశ్వర్.

''అది కాదమ్మా... నువ్విక్కడ ఒంటరిగా ఉండి ఏం చేస్తావు. అదీగాక మాకు నువ్వు, నీకు మేము తప్ప ఎవరున్నారు. సావకాశంగా ఎక్కువ రోజులు లీవు పెట్టి ఓసారి వచ్చి ఇల్లు అమ్మేద్దాము. ఈ ఊళ్ళో ఇల్లు తప్ప మనకింకేం బంధం ఉంది. అప్పటిదాకా అద్దెకున్న వాళ్ళని ఇల్లు చూసుకోమందాము.''

''అవునత్తయ్యా.. మీరిక్కడ ఒక్కళ్ళూ ఉంటే ఏం బావుంటుంది. అందరూ మమ్మల్ని తప్పుపడ్తారు'' శరణ్య భర్త మాటలని సమర్థిస్తూ అత్తగారిని ఆహ్వానించింది, తను ఏమీ మాట్లాడకపోతే బావుండదన్నట్టు.

వసుంధర కోడలు వైపు ఓసారి చూసి చూపులు తిప్పుకుంది. శరణ్య మంచిదే. ఇదివరకు రెండు, మూడుసార్లు వసుంధరా, జగన్నాథంగారు, ఈశ్వర్ దగ్గర కొన్నాళ్ళు ఉండి వచ్చారు. ఈశ్వర్, శరణ్యా ఎంతో మర్యాదగా చూసుకునేవారు. పిల్లలూ ప్రేమగా, ఆప్యాయంగానే ఉంటారు. అయితే ఈశ్వర్, శరణ్యా ఇద్దరూ పగలంతా ఇంట్లో లేకపోయినా వసుంధరా, జగన్నాథంగారు పుస్తకాలు చదువుతూనో, వంటపనీ, ఇంట్లో చిన్న చిన్న పనులు ఏవైనా చేస్తూనో కాలక్షేపం చేశారు. అయినా వాళ్ళేమీ అనకపోయినా మర్యాదకీ, ఆప్యాయతకీ లోటు రానివ్వకపోయినా తమ ఉనికి వాళ్ళకి ఇబ్బందిగానే ఉందని గ్రహించేవారు వసుంధరా, జగన్నాథం. వీళ్ళకోసం వాళ్ళ వంటల్లో మార్పు వచ్చేది. సాయంకాలం ఇంట్లో పెద్దవాళ్ళతో గడపాలి కాబట్టి అన్నట్టు వాళ్ళు ఎక్కడీ బయటికి వెళ్ళేవారు కాదు. వెళ్తే నలుగురూ ఏదైనా గుడికో.. గోపురానికో.

ఈశ్వర్ అద్దెకున్న ఇల్లు నాలుగ్గదులు అన్నమాటే కానీ చిన్నదే. వాళ్ళకి ప్రైవసీ కూడా తక్కువగానే ఉండేది.

వాళ్ళు ఏం అనకపోయినా వాళ్ళ జీవనసరళిలో తాము వెళ్ళినప్పుడు కొన్ని మార్పులు వస్తున్నాయి అన్నది వాళ్ళు ఇట్టే గ్రహించేవాళ్ళు.

తమని వదిలేసి సినిమాలకీ, షికార్లకీ హోటళ్ళకీ వెళ్ళనూ లేరు. పార్టీలకీ దానికీ కూడా తామున్నామని వెళ్ళటం మానేసేవారు.

ఇంట్లో సాయంత్రం కాస్సేపైనా తల్లిదండ్రులతో గడపాలన్న ఈశ్వర్ కోరిక మేరకు శరణ్యా పైకి తేలకుండా ఉండేది. ఇప్పుడు తనకి బీపీ, షుగరూ రెండూ ఉన్నాయి.

ఇంట్లో వంట కూడా ఒకే రకంగా చేసుకోవడానికి కుదరదు. వయసులో ఉన్నవాళ్ళు మసాలాలు అవీ వండుకోకుండా తనకోసం చప్పిడి కూరలు తింటూ, స్వీట్లు తినకుండా ఉంటారా? తనకి పెట్టకుండా తినడానికీ బిడియపడ్తారు.

తను ఈశ్వర్ ఇంట్లో చేరడం అందరికీ ఇబ్బందే. దూరంగా ఉన్నప్పుడే ఆప్యాయతలు. దగ్గరయినకొద్దీ బాధ్యత బరువు అనిపిస్తుంది. కొన్నాళ్ళు మాత్రమే ఉంటారు అన్నది తెలుసు కాబట్టి ఇదివరకు ఈశ్వర్, శరణ్యా తమకి ఏమాత్రం ఇబ్బంది ఉండకూడదు అన్నట్టు ప్రవర్తించేవాళ్ళు.

ఇప్పుడు శాశ్వతంగా ఉండిపోతుంది అన్న భావం వస్తే వాళ్ళు మారిపోతారు. అది సహజమే. ఒకరి కోసం ఎన్నాళ్ళని వాళ్ళు వాళ్ళ జీవన విధానాన్ని మార్చుకోగలరు.

సాధ్యమయినంత వరకూ విడిగా ఇక్కడ ఉండడమే మంచిది. అందుకే ఇదివరకైనా ఈశ్వర్ బాధపడ్తాడు అని రెండు, మూడుసార్లు వెళ్ళారు తప్ప తనకిగానీ, జగన్నాథంగారికి గానీ వాళ్ళ దగ్గర ఉండాలని ఎప్పుడూ అన్పించేది కాదు.

తను అక్కడికి వెళ్ళడం వల్ల అందరూ ఇరుకున పడిపోతారు.

తనకి భాష రాదు. నీళ్ళ ఇబ్బంది. పనిమనిషి ఇబ్బంది. ఇక్కడైతే డాక్టర్ దగ్గరికి తను ఒక్కర్తే వెళ్ళి వస్తుంది. అన్ని పనులూ స్వయంగా చేసుకుంటుంది.

సాయంత్రం వీధిలో ఎంతోమంది తన ఈడు వాళ్ళు ఉన్నారు. వాళ్ళతో గుడికో గోపురానికో వెళ్ళి కాలక్షేపం చేస్తుంది. మధ్యాహ్నం కూడా ఎవరో ఒకరు వచ్చి కాస్సేపు కబుర్లు చెప్తారు.

తోచకపోవడం అన్న ప్రశ్నే లేదు. ఇక్కడ తెల్సిన వాళ్ళు పదిమంది ఉన్నారు. ఏ పని చెప్పినా చిటికెలో చేసుకొస్తారు.

తను ఇక్కడ ఒంటరిగా ఉన్నా ఒంటరికాదు.




కానీ ఈశ్వర్‌తో వెళ్తే కొడుకూ కోడలూ మనవళ్ళతో ఉన్నా తను ఒంటరిదైపోతుంది. అయినా పూర్తిగా మంచమెక్కితే తప్ప వాళ్ళ దగ్గరికి వెళ్ళి ఉండకూడదు.

ఈ మాటే జగన్నాథంగారు వసుంధరతో ఎన్నో సార్లు చెప్పేవారు. సాధ్యమయినంతవరకూ స్వతంత్రంగా బ్రతుకుదామని, పరాన్నజీవులుగా మారకూడదనీ. అదే సరైన పద్ధతి. పేరసైట్‌లా కాక ఒకళ్ళమీద ఆధారపడక సాధ్యమయినంతవరకూ స్వతంత్రంగానే జీవించాలి.

అంతగా తోడు కావాలంటే తన చెల్లెలు భర్తపోయి పిల్లలతో నానాపాట్లూ పడుతోంది. రమ్మంటే ఒకరికొకరు తోడవుతాం.

''ఏంటమ్మా.. ఏం ఆలోచిస్తున్నావు?'' ఈశ్వర్ మాటలతో ఈ లోకంలోకి వచ్చింది వసుంధర.

''ఏం లేదురా..ఈ ఇల్లూ.. ఈ ఊరూ అలవాటైన పరిసరాలు..వదిలి రాలేనురా. అయినా నేనిప్పుడేమంత ముసలిదానినైపోయానని. అన్ని పనులూ చేసుకోగలను. అక్కడ మీరిద్దరూ ఉద్యోగాలకి వెళ్ళిపోతే నేనొక్కదాన్నీ ఉండాలి. సాధ్యమయినంతవరకూ పేరసైట్‌లా బ్రతకకూడదు అనేవారు మీ నాన్నగారు.

నా టికెట్ కేన్సిల్ చేయించు. మూలపడితే ఎలాగూ మీకు చెయ్యకా తప్పదు, నేను మీ దగ్గరికి వచ్చి ఉండకా తప్పదు.''

''ఏంటమ్మా..అంతలా ఆలోచిస్తున్నావు. మాకు నువ్వు బరువా? ఒక్కర్తివీ ఇక్కడ...''

''ఈశ్వర్! ఈ వూళ్ళో అందరూ తెల్సినవాళ్ళే. ఎవర్ని పిలిచినా పలుకుతారు. వీధినిండా నా ఈడు వాళ్ళు కాలక్షేపానికి ఉన్నారు.

అంతగా ఒంటరిని అన్పిస్తే సరస్వతిని పిలుస్తాను. ఇద్దరం ఉంటాం.

నా గురించి ఆలోచించక మీరు వెళ్ళండి.''

ఈశ్వర్ చిన్నబుచ్చుకున్నట్టు మొహం పెట్టాడు ఏం మాట్లాడాలో తెలియక.

అత్తగారి నిర్ణయం శరణ్యకి ఎంతో రిలీఫ్‌గా ఉంది. అత్తగారు ఎంత మంచిదైనా ఆవిడ తమతో ఉంటే ఇబ్బందే.

ప్రైవసీ తక్కువవడమే కాకుండా వంటల్లో, కొన్ని పద్ధతుల్లో మార్పు చేయక తప్పదు. డబ్బంటే ఎంత పంపించినా పర్వాలేదు.

కానీ తమ స్వేచ్ఛకి అడ్డు అన్పిస్తే మాత్రం సర్దుకోవడం కష్టం.

''అత్తయ్యగారు, సరస్వతి అత్తయ్యగార్ని పిల్చుకుంటానన్నారుగా. కొన్నాళ్ళయ్యాక ఆవిడకి ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడే వస్తారు.

మీరు మరీ బలవంత పెట్టకండి. మామయ్యగారు మసిలిన ఈ ఇంటిని అంత త్వరగా ఆవిడ వదలలేరు.

మనమే అప్పుడప్పుడూ వచ్చి చూద్దాం..'' శరణ్య, ఈశ్వర్ వైపు చూస్తూ అంది.

ఈశ్వర్‌కి కాస్త కష్టం అన్పించినా తల్లి నిర్ణయం ఓ రకంగా తనని గట్టున పడేసింది అనుకున్నాడు. పిల్లల ట్యూషన్, డాన్స్, స్పోర్ట్స్ క్లాసులంటూ రోజూ ఈశ్వర్, శరణ్యా ఆఫీసులకి వెళ్ళేముందు, వచ్చాకా కూడా చాలా బిజీగా ఉంటున్నారు. ఇంట్లో ఉండేది తక్కువ. సగం రోజులు రాత్రి భోజనం బయటే. నిజంగా తల్లి తమతో వస్తే తాము కొన్ని యాక్టివిటీస్‌కి స్వస్తి చెప్పాల్సిందే. తన కొలీగ్స్ ఇళ్ళల్లో కొంతమంది తల్లి, తండ్రిని ఉంచుకుని వాళ్ళు వీళ్ళమీద.. వీళ్ళు వాళ్ళ వల్ల ఎన్ని ఇబ్బందుల పాలవుతున్నారో వాపోవడం, ఇంట్లో రోజూ జరిగే భాగవతాలతో పిచ్చెక్కిపోతోందనడం, మానసికంగా నలిగిపోవడం చూస్తూనే ఉన్నాడు.

ఎంతో ముందు చూపుతో సాధ్యమైనంతవరకూ కొడుకు మీద ఆధారపడకుండా స్వతంత్రంగా ఉండాలన్న తల్లి నిర్ణయాన్ని హర్షించకుండా ఉండలేకపోయాడు ఈశ్వర్.

తల్లిని తనతో రావడానికి ఒప్పించలేకపోయాననే దిగులు ఉన్నా.

✤

ఎమ్.నాగలక్ష్మి